సాక్షి
యాదాద్రి భువనగిరి
శుక్రవారం ׀ 17 ׀ మార్చి ׀ 2023



దారి దోపిడీ ముఠా అరెస్టు

వాహనదారులను బెదిరించి దోపిడీలకు పాల్పడుతున్న ముఠాను నల్లగొండ పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో



ఆదాయం రూ.2.55 కోట్లు

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. - 10లో

గరిష్టం/కనిష్టం
36°/22°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జ్ఞాపకశక్తి మెరుగునకు ఆయూష్ హెల్త్ కిట్లు



విద్యార్థినులకు హెల్త్‌కిట్లు అందజేస్తున్న ఆయూష్ శాఖ డైరెక్టర్లు

భూదాన్‌పోచంపల్లి : విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి మెరుగునకు ఆయూష్ హెల్త్ కిట్లు దోహదపడుతాయని తెలంగాణ ఆయూష్ శాఖ డైరెక్టర్లు డాక్టర్ లింగరాజు, డాక్టర్ పరమేశ్‌నాయక్ అన్నారు. గురువారం భూదాన్‌పోచంపల్లి మండలంలోని జలాల్‌పురంలో గల కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయంలో ఆయూష్‌శాఖ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థినులకు ఆయూష్ హెల్త్‌కిట్లు, రాగిలడ్డూలు పంపిణీ చేశారు. అనంతరం పౌష్టికాహారం, ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత, రుతుచర్యపై అవగాహన కల్పించారు. సహజసిద్ధంగా తయారు చేసిన ఆయుర్వేద, హోమియోపతి, యునానికి సంబంధించిన ఔషధాలతో హెల్త్ కిట్లు తయారు చేశారని తెలిపారు. కార్యక్రమంలో రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వసంతరావు, ఆయూష్ శాఖ డాక్టర్లు రమాదేవి, శీలారాణి, లలిత, పృథ్వీరాజ్, అనిత తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ బ్యాక్‌లాగ్ పరీక్షల షెడ్యూల్ విడుదల

ఎంజీయూ(నల్లగొండ రూరల్): 2011–12 విద్యా సంవత్సరం డిగ్రీ బ్యాక్‌లాగ్ పరీక్షల షెడ్యూల్‌ను ఎంజీయూ గురువారం విడుదల చేసింది. వివిధ కారణాలతో ఉత్తీర్ణత కాని వారు, సెమిస్టర్ విధానానికి పూర్వం ఇయర్ వైజ్ పరీక్షలకు హాజరైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంజీయూ పరీక్షల నియంత్రణ అధికారి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31లోపు ఎలాంటి అపరాదం లేకుండా, రూ.100 అపరాదంతో ఏప్రిల్ 3 వరకు ఫీజు చెల్లించవచ్చని తెలిపారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి



వివరాలు తెలుసుకుంటున్న ప్రతినిధులు

చౌటుప్పల్ : కాయకల్ప్ ప్రతినిధులైన డబ్ల్యూహెచ్ఓ కన్సల్టెంట్ డాక్టర్ శ్రవణ్, సిద్దిపేట మెడికల్ కళాశాల వైద్యురాలు డాక్టర్ రాజ్యలక్ష్మి గురువారం చౌటుప్పల్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను సందర్శించారు. ఆస్పత్రిలో రికార్డులు, వార్డులు, పరిసరాలను పరిశీలించి వైద్య సిబ్బందికి సూచనలు చేశారు. పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వారి వెంట డీసీహెచ్ఎస్ చిన్నానాయక్, ఆస్పత్రి సూపరింటెండెంట్ కె.అలివేలు, వైద్యులు, పాండురంగం, వివేక్, సతీష్, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులు ఆందోళన చెందవద్దు



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న డీఈఓ

తుర్కపల్లి : విద్యార్థులు ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని డీఈఓ నారాయణరెడ్డి సూచించారు. గురువారం తుర్కపల్లి మండలంలోని దత్తాయపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులు వెనుకబడ్డ సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. మన ఊరు – మన బడి పనులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సుశీలరవీందర్‌నాయక్, ఎంపీడీఓ ఉమాదేవి, ఏంఈఓ క్రిష్ణ పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కీంకు దరఖాస్తు చేసుకోవాలి

భువనగిరిటౌన్ : బెస్ట్ అవైలబుల్ స్కీంకు ప్రైవేట్ పాఠశాలలు దరఖాస్తు చేసుకోవాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారీ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో గురువారం ప్రైవేట్ పాఠశాలల యజమానులతో సమావేశం అయ్యారు. ఈ నెల 31లోగా జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, 1,5వ తరగతులకుఈ స్కీం వర్తిస్తుందన్నారు. యాదాద్రి జిల్లాకు 1వ తరగతి 22 సీట్లు, 5వ తరగతికి 22 సీట్లు కేటాయించినట్లు తెలిపారు.

అప్పు తెచ్చి అభివృద్ధి!

సకాలంలో బిల్లుల రాక సర్పంచుల వెతలు

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిలిచిపోతున్న నిధులు.. వచ్చినవి ఫ్రీజింగ్
- తాగునీటి అవసరాలు కూడా తీర్చలేని దుస్థితి
- నిరసనకు దిగుతున్న సర్పంచ్‌లు

ఆలేరు మండలం శర్బనాపురంలో గ్రామ పంచాయతీలో మంచినీటి బోరు ఎండిపోయింది. మరో చోట బోరు వేయడానికి డబ్బులు లేకపోవడంతో సర్పంచ్ భర్త సిరిగిరి సాగర్ భిక్షాటన చేయగా రూ.50వేలు సమకూరాయి. వీటితో బోరు వేయించారు. మరో రూ.10వేలు మోటారు రిపేర్ కోసం ఖర్చు చేశారు. ఇవే కాకుండా వివిధ పనుల కోసం ప్రైవేట్ వ్యక్తుల వద్ద తెచ్చిన అప్పులు రూ.70వేలు ఉన్నాయని సర్పంచ్ తెలిపారు. గ్రామ పంచాయతీకి ప్రతి నెలా రూ.40వేలు ప్రభుత్వం నుంచి రావాలి. ఇందులో రూ.32వేలు ట్రాక్టర్ ఈఎంఐ, డీజిల్ బిల్లులు, విద్యుత్ బిల్లు, రూ.17వేలు సిబ్బంది వేతనాలు, బ్లీచింగ్ పౌడర్, శానిటేషన్ పనుల కోసం ఖర్చవుతుంది. ఆరు నెలలుగా నిధులు సరిగా రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని సర్పంచ్ వాపోయారు.





గుండాల మండలంలోని పెద్దపడిశాల సర్పంచ్ చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి సుమారు రూ.34 లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉంది. పనుల కోసం ప్రైవేట్‌గా రూ.20 లక్షలు అప్పు తెచ్చాడు. అంతేకాకుండా మోత్కూరులోని ముత్తూట్ ఫైనాన్స్‌లో తన భార్య బంగారు నగలు 6 తులాలు కుదువపెట్టి రూ.2 లక్షలు తెచ్చాడు. ఇందుకు గాను ప్రతి నెలా వడ్డీ రూ.2 వేలు చెల్లిస్తున్నాడు. ఎస్‌డీఎఫ్ నిధులు రూ.15 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించాడు. ఎన్ఆర్‌ఈజీఎస్‌లో 2021లో రూ.5 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, రూ.3 లక్షలతో రైతు వేదిక, శ్మశానవాటిక రూ.3 లక్షలు, గ్రామ పంచాయతీ నిధులతో వేసిన సీసీ రోడ్లు రూ.4లక్షలు, సైడ్ డ్రైయిన్ రూ.3.80 లక్షలు, గ్రామ పంచాయతీ మెయింటెనెన్స్ నిధులు రూ.లక్ష పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఇదే పరిస్థితి ఉంది.

సాక్షి,యాదాద్రి : గ్రామ పంచాయతీల్లో ఖజానా ఖాళీ అవటంతో అభివృద్ధి స్తంభించిపోయింది. ఇప్పటికే లక్షలాది రూపాయలు అప్పులు చేసి అభివృద్ధి పనులు చేసిన సర్పంచ్‌లకు బిల్లులు రావడం లేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నెలనెలా ఇవ్వాల్సిన డబ్బులు విడుదల చేయడం లేదు. 15వ ఆర్థిక సంఘం నిధులు వచ్చినా కీ ఇవ్వలేదు. స్టేట్ ఫైనాన్స్ నిధులపైనా ఫ్రీజింగ్ పెట్టడంతో చెక్‌లు పాస్‌కావడం లేదు. దీంతో సర్పంచ్‌లు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. చేసిన అప్పులు, వడ్డీలు తీర్చలేక నానాయాతన పడుతున్నారు. తాము చేసిన పనులకు బిల్లులు ఇప్పించాలని గురువారం గుండాల మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ముగ్గురు సర్పంచ్‌లు నేలపై బైఠాయించి నిరసన తెలిపారు. బిల్లులు విడుదల చేసి తమను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

రూ.కోట్లలో బకాయిలు

గ్రామ పంచాయతీల అభివృద్ధి, మెయింటెనెన్స్ కోసం ప్రతి నెలా జిల్లాలోని 421 గ్రామ పంచాయతీలకు రూ.6.19 కోట్లు వచ్చేవి. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.7 కోట్లు 9 నెలల క్రితం వచ్చాయి. ఆ నిధులు గ్రామ పంచాయతీల సర్పంచ్‌లకు తెలియకుండానే విద్యుత్, ఇతర బిల్లులకు మళ్లించారు. సర్పంచ్‌లు ఆందోళన చేయడంతో ప్రస్తుతం నిలిపి వేశారు. రెండు నెలల క్రితం రూ.2 కోట్లు గ్రామ పంచాయతీలకు వచ్చాయి. ఈ నిధులపై ప్రభుత్వం ఫ్రీజింగ్ పెట్టింది. దీంతో గ్రామ పంచాయతీ చెక్‌లు ఎస్‌టీఓల్లో క్లియర్ కావడంలేదు.

రావాల్సిన నిధులు ఇలా..

గ్రామ పంచాయతీల్లో ఎస్‌డీఎఫ్, ఎన్ఆర్ ఈజీఎస్, గ్రామ పంచాయతీ, 15వ ఆర్థిక సంఘం, ఎస్ఎఫ్‌సీ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టారు. కేవలం గ్రామ పంచాయతీ, ఎస్ఎఫ్‌సీ బకాయిలే రూ.9 కోట్ల మేరకు ఉన్నాయి. దీంతో పాటు ట్రాక్టర్ కిస్తులు, గ్రామ పంచాయతీ సిబ్బంది జీతాలు, అత్యవసర పనులైన మంచినీటి సరఫరా, మోటార్లకు కాలిపోతే, పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతులు, అదనంగా బోర్లు వేయవలిసి వస్తే ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. తెచ్చిన అప్పు తీర్చలేక, కనీసం వడ్డీ చెల్లించలేక సర్పంచ్‌లు నానాయాతన పడుతున్నారు. నిత్యం ప్రజల మధ్యన ఉండాల్సిన సర్పంచ్‌లు ఆర్థిక ఇబ్బందులు తాళలేక ముఖం చాటేస్తున్నారు. బిల్లులు చెల్లించలేకపోతే కొత్త పనులు చేపట్టలేమని అధికారులకు తేల్చి చెపుతున్నారు.

గుండాలలో సర్పంచ్‌ల నిరసన



పోడియం ఎదుట బైఠాయించిన సర్పంచ్‌లు

గుండాల : గ్రామ పంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు రాకపోవడంతో సర్పంచ్‌లు నిరసన తెలిపారు. గుండాల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీపీ అమరావతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మాసాన్‌పల్లి సర్పంచ్ రాంరెడ్డి, అనంతారం సర్పంచ్ తుమ్మ డెన్నిస్‌రెడ్డి, పెద్దపడిశాల సర్పంచ్ రావుల మల్లేష్ మాట్లాడుతూ.. లక్షలాది రూపాయలు పెట్టి అభివృద్ధి పనులు చేసి నెలలు గడుస్తున్నా ప్రభుత్వం ఖాతాలను ఫ్రీజింగ్‌లో పెట్టడంతో అవస్థలు పడుతున్నామన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో పాటు పల్లె ప్రకృతి వనంలో చేసిన పనులకు బిల్లులు రావడం లేదని ఎంపీడీఓను నిలదీశారు. అప్పుల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

6,361 మంది విద్యార్థులు హాజరు



భువనగిరిలోని పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

- ప్రశాంతంగా ఇంటర్ సెకండియర్ పరీక్షలు
- పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

భువనగిరి : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు జిల్లా వ్యాప్తంగా గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొత్తం 31 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతి, అరబిక్ పేపర్–2 పరీక్షకు 6,637 మంది విద్యార్థులకు గాను 6,361 మంది హాజరయ్యారు. 276 మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా 95 శాతం విద్యార్థులు పరీక్ష రాశారు.భువనగిరిలోని టైమ్స్ జూనియర్ కళాశాల సెంటర్‌ను కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. అదే విధంగా భువనగిరిలోని వైష్ణవి జూనియర్ కళాశాల, శ్రీ గాయత్రి బాలికల జూనియర్ కళాశాలల్లో పరీక్ష క్షేంద్రాలను ఇంటర్ బోర్డు అధికారులు తనిఖీ చేశారు.



భువనగిరి : టైమ్స్ జూనియర్ కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్

‘రీజినల్’ అలైన్‌మెంట్ మార్చండి

- కేంద్ర మంత్రి గడ్కరీకి గూడూరు నారాయణరెడ్డి విజ్ఞప్తి

సాక్షి, యాదాద్రి : బీఆర్ఎస్ నేతల స్వలాభం కోసం భువనగిరి నియోజకవర్గ పరిధిలో రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చారని బీజేపీ రాష్ట్ర నాయకుడు గూడూరు నారాయణరెడ్డి ఆరోపించారు. రైతులు నష్టపోతున్న నేపథ్యంలో రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని కోరుతూ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని గురువారం ఢిల్లీలో కలిసి వినతిపత్రం అందజేశారు. భువనగిరి మండలంలోని రాయగిరి, గౌస్ నగర్, వలిగొండ మండల పరిధిలోని వర్కట్‌పల్లి రైతులు రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం కోసం తమ భూములు ఇవ్వడానికి సిద్ధంగా లేరన్నారు.ఈ ప్రాజెక్టు కోసం భూములను సేకరించేందుకు ప్రతిపాదనలు రూపొందిస్తున్న సమయంలో అనేక అవకతవకలు జరిగాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం తమ పార్టీ ప్రజాప్రతినిధుల ప్రయోజనాల కోసం అలైన్‌మెంట్ మార్చిందనే ఆరోపణలు ఉన్నాయన్నారు. భూసేకరణ ప్రతిపాదన రాగానే తుర్కపల్లి, రాజాపేట, మోటకొండూరు తదితర మండలాల మీదుగా రోడ్డు నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించి నోటిఫికేషన్ జారీ చేశారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నేతల ఒత్తిడితో నోటిఫికేషన్‌ను మార్చి దక్షిణ యాదగిరిగుట్ట, రాయగిరి, వర్కట్‌పల్లి, గౌస్‌నగర్ మీదుగా రోడ్డు నిర్మించాలని ప్రతిపాదించారని తెలిపారు. భువనగిరి రెవెన్యూ డివిజనల్ పరిధిలో దాదాపు 493 ఎకరాల భూమిని సేకరించనుండగా ఒక్క రాయగిరి రైతులు 266 ఎకరాలు భూమి కోల్పోతున్నారని వివరించారు. ప్రత్యేకాధికారిని నియమించి అక్రమాలను పరిశీలించాలని నారాయణరెడ్డి కోరారు.



గడ్కరీకి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకుడు గూడూరు నారాయణరెడ్డి

ఎన్నికలప్పుడే ప్రజలు గుర్తుకొస్తారా?

- పాలకులకు ప్రజా సమస్యలు పట్టడం లేదు
- డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా మిర్చీలు వేస్తున్న అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి టౌన్ : బీఆర్ఎస్ నాయకులకు ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజలు గుర్తుకొస్తారని, మిగితా సమయంలో పట్టించుకున్న పాపాన పోరని డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. గురువారం భువనగిరిలో నిర్వహించిన హాథ్ సే హాథ్ జోడో యాత్రలో ఆయన మాట్లాడారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీలో ప్రభుత్వం విఫలమైందన్నారు. సొంత జాగా ఉన్న వారికి ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు ఇస్తామని చెప్పి ఇప్పుడు రూ.3లక్షలు ఇవ్వడేంటని ప్రశ్నించారు. భువనగిరిలోని ప్రభుత్వం జూనియర్ కళాశాల మైదానం అభివృద్ధికి ఏ నిధుల నుంచి ఖర్చు చేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. డ్రైయినేజీలు, రోడ్ల పనులు శాస్త్రీయత లోపించిందన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకే హాథ్ సే హాథ్ జోడో యాత్ర చేపట్టినట్లు తెలిపారు. యాత్రలో గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు ఉద్యమాలు చేస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో భువనగిరి నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలన్నారు. సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్‌కుమార్, టీపీసీసీ సభ్యులు తంగళ్లపల్లి రవికుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బీసుకుంట్ల సత్యనారాయణ, నాయకులు కుక్కదువ్వు సోమయ్య, లాల్‌రాజ్, బర్రె జహంగీర్, కోట పెద్దస్వామి, చల్లగురుగుల రఘుబాబు, గుర్రాల శ్రీనివాస్, మజహార్, ఈరపాక నర్సింహ, పిట్టల బాలరాజు, అమాన్‌తుల్లా, దర్గాయి హరిప్రసాద్, సలావుద్దీన్, బర్రె నరేష్, మనోజ్ పాల్గొన్నారు.

16 పాఠశాలలు సిద్ధం

- పూర్తయిన అభివృద్ధి పనులు
- త్వరలోనే ప్రారంభం
- మన ఊరు – మన బడితో మారుతున్న రూపురేఖలు



‘మన ఊరు - మన బడి’లో భాగంగా ఇటీవల భువనగిరిలో ప్రారంభించిన పాఠశాల

భువనగిరి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు – మన బడి కార్యక్రమంలో భాగంగా తొలి విడత ఎంపిక చేసిన పాఠశాలల్లో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దేందుకు 2022 ఫిబ్రవరిలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏప్రిల్ 23వ తేదీ నాటికి ఎంపిక చేసిన పాఠశాలల్లో పనులన్నీ పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకు అనుగుణంగా పనుల్లో వేగవంతం చేశారు. ఎప్పటికప్పుడు అధికారులు సమీక్షలు నిర్వహించడంతో పాటు పనులను పర్యవేక్షిస్తున్నారు.

251 పాఠశాలలు ఎంపిక

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు 712 ఉన్నాయి. మొదటి విడతలో 251 పాఠశాలలను ఎంపిక చేశారు. వీటిలో ప్రాథమిక 48, ప్రాథమికోన్నత 20, జిల్లా పరిషత్, ఉన్నత పాఠశాలలు 83 ఉన్నాయి. 26 పాఠశాలల్లో పనులకు సంబంధించి టెండర్లు పురోగతిలో ఉండగా 15 చోట్ల పూర్తయ్యాయి. ఇంకా 11 పాఠశాలలకు టేండర్లు వేయవల్సి ఉంది. మిగిలిన పాఠశాలల్లో పనులు పాఠశాలల యాజమాన్య కమిటీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఎంపిక చేసిన పాఠశాలలకు ప్రభుత్వం రూ.44.29 కోట్లు మంజూరు చేసింది. ఇప్పటి వరకు రూ.7.12 కోట్లు విడుదల అయ్యాయి. ఇప్పటి వరకు 13 పాఠశాలలను పనులు పూర్తి చేసి ప్రారంభించగా మరో 16 పాఠశాలలు ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నాయి.

ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం

“మన ఊరు – మన బడి కింద ఎంపిక చేసిన పాఠశాలల్లో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. అధికారులను అప్రమత్తం చేశారు. పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నాం.

–నారాయణరెడ్డి, డీఈఓ

12 రకాల పనులు

మన ఊరు – మన బడి కార్యక్రమం కింద ఎంపిక చేసిన పాఠశాలల్లో 12 అంశాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ప్రధానంగా నూతన తరగతి గదులు నిర్మించడం, శిథిలావస్థలో ఉన్నవాటిని మరమ్మతులు, విద్యుదీకరణ, తాగునీటి సౌకర్యం, భోజనశాల ఏర్పాటు, మరుగుదొడ్ల నిర్మాణం, ప్రహారీల నిర్మాణం, వంట గదులు, ఫర్నిచర్, గ్రీన్ బోర్డు, డిజిటల్ తరగతులు, పేయింటింగ్ వంటి అంశాలలో అభివృద్ధి చేస్తున్నారు.

పరిహారం ఇంకెప్పుడిస్తరు?



బస్వాపురం రిజర్వాయర్ వద్ద దీక్ష చేపట్టిన నిర్వాసితులు

- ఎమ్మెల్యే పట్టించుకోవాలి
- లప్పానాయక్‌తండా వాసుల దీక్ష

యాదగిరిగుట్ట రూరల్ : బస్వాపురం రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న లప్పానాయక్ తండా వాసులు పరిహారం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని పునరావాసం కల్పించాలని డిమాండ్ చేస్తూ రిజర్వాయర్ కట్ట వద్ద గురువారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో దీక్ష చేసినప్పుడు జేసీ, ఆర్డీఓ వచ్చి నెలలోనే తమకు ఆర్ అండ్‌ఆర్‌ప్యాకేజీ చెల్లించడంతో పాటు పునరావాసం కల్పిస్తామ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఆరు నెలలు గడిచినా కార్యరూపం దాల్చలేదన్నారు. తమతో పాటు ముంపునకు గురవుతున్న భువనగిరి మండలంలోని బీఎన్ తిమ్మాపురం గ్రామస్తులకు అక్కడి ఎమ్మెల దగ్గరుండి పరిహారం ఇప్పిస్తున్నారని, తమ ఎమ్మెల్యే సరిగా స్పందించడం లేదని వాపోయారు. రాజకీయ నాయకులు ఎవ్వరూ తమను పట్టించుకోవడం, న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దీరావత్ బుజ్జి శంకర్, నిర్వాసితులు పాల్గొన్నారు.

‘బునాదిగాని’ ద్వారా గోదావరి జలాలు

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

ఆత్మకూరు(ఎం) : ఆత్మకూరు(ఎం) ప్రాంత రైతులకు బునాదిగాని కాల్వ ద్వారా త్వరలో గోదావరి జలాలు అందించనున్నట్లు ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి తెలిపారు. సొంత నిధులతో ఆత్మకూర్(ఎం) మండల పరిధిలో చేపట్టిన బునాదిగాని కాల్వ పనులను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పిల్లాయిపల్లి, ధర్మారం, బునాదిగాని కాల్వల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.285 కోట్లు మంజూరు చేసిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు బస్వాపురం వరకు రానున్నాయని, అక్కడి నుంచి ప్రత్యేక కాల్వ నిర్మించి వీరవెల్లి వద్ద బునాదిగాని కాల్వకు అనుసంధానం చేయనున్నట్లు వెల్లడించారు. అనంతరం తుక్కాపురంలోని శ్రీబీరప్ప దేవాలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐబీ డీఈ సునీల్‌ప్రసాద్, ఏఈ వెంకటరమణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్, మార్కెట్ డైరెక్టర్ గడ్డం దశరథగౌడ్, రైతుసమితి జిల్లా సభ్యులు కోరె భిక్షపతి, బీసు . ధనలక్ష్మి, మండల కోఆర్డినేటర్ యాస ఇంద్రారెడ్డి, ఎంపీటీసీ యాస కవిత, సర్పంచ్‌లు దయ్యాల రాజు, కోల సత్తయ్య, ఆర్‌ఐ చిప్పలపల్లి యాదగిరి, బాషబోయిన ఉప్పలయ్య యాదవ్, కాంబోజు భాను, నాయకులు కోరె వెంకన్న, నాతి రాజు, సోలిపురం అరుణ పాల్గొన్నారు.



బునాదిగాని కాల్వ పనులను పరిశీలిస్తున్న సునీత



సెల్యూట్ వీవీరెడ్డి

బొమ్మలరామారం మండల కేంద్రానికి చెందిన ఉప్పల నర్సింహారెడ్డి కుమారుడు, ఆర్మీలో లెఫ్టినెంట్ కల్నల్ వినయ్‌భానురెడ్డి గురువారం అరుణాచల్‌ప్రదేశ్‌లో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో మృతిచెందారు. నర్సింహారెడ్డి కుటుంబం కొన్ని సంవత్సరాల క్రితం హైదరాబాద్‌లోని మేడ్చల్‌లో స్థిరపడింది.

లెఫ్టినెంట్ కల్నల్ ఉప్పల వినయ్‌భానురెడ్డితో తల్లిదండ్రులు (ఫైల్)

క్లుప్తంగా

చెరువులో పడి వ్యక్తి మృతి


సురేందర్ (ఫైల్)

రామగిరి(నల్లగొండ): చెరువులో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన తిప్పర్తి మండలంలోని పజ్జూరు గ్రామంలో గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పజ్జూరు గ్రామానికి చెందిన పేరపాక సురేందర్(35) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సురేందర్ భార్య గతేడాది అనారోగ్యంతో మృతిచెందింది. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. గత కొన్ని రోజులుగా మద్యానికి బానిసైన సురేందర్ మంగళవారం తెల్లవారుజామున ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కాగా గురువారం తెల్లవారుజామున పజ్జూరు సమీపంలోని ఎర్రకుంట చెరువులో సురేందర్ మృతదేహం గమనించిన గ్రామస్తులు కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వాస్పత్రి తరలించారు. మృతుడి బావ కదిరి వీరేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తిప్పర్తి ఎస్ఐ వాస ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

మహిళను వేధించిన వ్యక్తి రిమాండ్

శాలిగౌరారం: మహిళను లైంగికంగా వేధించిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ సతీష్ గురువారం విలేకరులకు వెల్లడించారు. మండలంలోని రామాంజాపురం గ్రామానికి చెందిన మహిళను అదే గ్రామానికి చెందిన వేల్పుల వెంకన్న బుధవారం లైంగికంగా వేధింపులకు గురిచేశాడు. సదరు మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టి నిందితుడు వెంకన్నను గురువారం అరెస్ట్ చేసి నకిరేకల్ కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు. మెజిస్ట్రేట్ ఆదేశానుసారం నిందితుడిని రిమాండ్ కోసం నల్లగొండ జైలుకు తరలించనట్లు వివరించారు. బాధిత మహిళను నిందితుడు గతంలో కూడా లైంగిక వేధింపులకు గురిచేయడంతో కేసు నమోదు కాగా కోర్టు విచారణలో ఉన్నట్లు ఎస్ఐ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

దేవరకొండ: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన గురువారం దేవరకొండ పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్ఐ సతీష్ తెలిపిన ప్రకారం.. పట్టణానికి చెందిన నీలా మల్లేశ్(32) మేస్త్రీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పట్టణంలోని మహబూబ్‌నగర్ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న ఇంటికి మేస్త్రీగా పనిచేస్తున్నాడు. గురువారం తన బైక్‌లో పెట్రోల్ అయిపోవడంతో ముదిగొండ ఎక్స్‌రోడ్డు వద్ద పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ పోయించుకొని అదే ఇంటి వద్దకు బయల్దేరాడు. ఈ క్రమంలో వెనుక నుంచి వస్తున్న మరో బైక్ మల్లేశ్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య వజ్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

దారి దోపిడీ ముఠా అరెస్ట్

- కారు, 39 సెల్‌ఫోన్లు, ఇనుప రాడ్డు, కత్తి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన నల్లగొండ ఎస్పీ అపూర్వరావు


అరెస్ట్ చేసిన నిందితులను చూపుతున్న నల్లగొండ జిల్లా ఎస్పీ అపూర్వరావు, పోలీసులు


నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు, కత్తి, ఇనుప రాడ్డు

నల్లగొండ క్రైం: రోడ్డు పక్కన ఆపిన వాహనదారులను బెదిరించి దోపిడీలకు పాల్పడుతున్న ఏడుగురు అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను నల్లగొండ పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి ఒక కారు, 39 సెల్‌ఫోన్లు, కత్తి, ఐరన్ రాడ్డు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను గురువారం నల్లగొండ జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ అపూర్వరావు విలేకరులకు వెల్లడించారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని మాదన్నపేట శివాలయం ప్రాంతానికి చెందిన ఉబది అరవింద్, రంగారెడ్డి జిల్లా యాచారం ప్రాంతానికి చెందిన కడమంచి గణేష్, మేడ్చల్ జిల్లా ఈసీఐఎల్ సమీపంలో ఉంటున్న కరమంచి శ్రీహరి, రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మొండిగౌరెల్లికి చెందిన విగ్నేష్ అలియాస్ విక్కీ, నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం జంగాలవారిగూడేనికి చెందిన ఆలేటి వెంకటయ్యతో పాటు మరో ఇద్దరు మైనర్లు కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ ఏడుగురు కలిసి ముఠాగా ఏర్పడి దారి దోపిడీలకు పాల్పడుతున్నారు. ఈ నెల 9వ తేదీన నల్లగొండ మండలంలోని దండెంపల్లి గోశాల వద్ద డీసీఎంను ఆపి అందులో నిద్రిస్తున్న డ్రైవర్‌ను వీరు కారులో వచ్చి బెదిరించి రూ.1500 నగదు, సెల్‌ఫోన్ లాక్కొని పారిపోయారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను పట్టుకునేందుకు పానగల్ బైపాస్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించగా.. కారులో వస్తున్న వీరు పోలీసులను చూసి మిర్యాలగూడ వైపు పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. కారును తనిఖీ చేయగా అందులో ఇనుప రాడ్డు, కత్తి లభించాయని, వాటితో పాటు 39 సెల్‌ఫోన్లను నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. ఇటీవల వీరు హైదరాబాద్‌లో ఒక కారును కిరాయికి తీసుకొని రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద ఓ ప్రయాణికుడిని అందులో ఎక్కించుకొని చౌటుప్పల్ మండల పరిధిలోని దండుమైలారం వద్దకు రాగానే కంపచెట్లలోకి కారును తీసుకెళ్లి ఆ ప్రయాణికుడిని కొట్టి సెల్‌ఫోన్, నగదును లాక్కొని పారిపోయినట్లు ఎస్పీ పేర్కొన్నారు. అంతేకాకుండా చౌటుప్పల్‌లో ఆగి ఉన్న లారీలో చార్జింగ్ పెట్టిన సెల్‌ఫోన్ చోరీ చేశారని, వీరు హైదరాబాద్‌లోని హయత్‌నగర్, ఎల్బీనగర్ ప్రాంతాలతో పాటు చౌటుప్పల్, నార్కట్‌పల్లి, నల్లగొండ తదితర ఇదే తరహాలో దారి దోపిడీలకు పాల్పడ్డారని తెలిపారు. వీరిలో అరవింద్, గణేష్ గతంలోనూ ఇలాంటి దొంగతనాలే చేసి జైలుకు వెళ్లి వచ్చినా, తమ ప్రవర్తన మార్చుకోకుండా తిరిగి దారి దోపిడీలకు పాల్పడుతున్నారని ఎస్పీ వివరించారు. ఈ కేసును ఛేదించిన పోలీసులను ఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో డీఎస్పీ నర్సింహారెడ్డి, సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, ట్రాఫిక్ సీఐ శ్రీను, ఎస్సైలు రాజశేఖర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, కానిస్టేబుళ్లు ఉన్నారు.

● చంటిపాపతో పరీక్షకు హాజరు


పరీక్షకు హాజరవుతున్న పూజిత, వెనక చంటిపాపను ఎత్తుకున్న పూజిత తల్లి

నల్లగొండ జిల్లా కేంద్రంలోని కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి కళాశాలలో ఇంటర్ ఒకేషనల్ జూనియర్ కళాశాల సెంటర్‌కు ఎంఎల్‌టి పరీక్ష రాయడానికి మునుగోడుకు చెందిన పూజిత తన చంటిపాపతో వచ్చింది. తన తల్లితో కలిసి వచ్చిన పూజిత.. పరీక్ష కేంద్రం ఆరుబయట చంటిపాపను తన తల్లికి అప్పగించి వెళ్లి పరీక్ష రాసివచ్చింది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

పిడుగుపాటుతో ఇంట్లోని సామగ్రి దగ్ధం

- రూ.9లక్షల ఆస్తి నష్టం


దగ్ధమైన ఫర్నీచర్

మిర్యాలగూడ అర్బన్: పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో నివాసముంటున్న గంటా శ్రవణ్‌రెడ్డి ఇంటిపై గురువారం సాయంత్రం పిడుగు పడి షార్ట్ సర్క్యూట్ జరిగి ఇంట్లోని ఫర్నీచర్ పూర్తిగా కాలిపోయింది. విద్యుత్ వైర్లు పూర్తిగా కాలిపోవడంతో ఆ మంటలు ఇంట్లోని వస్తువులకు అంటుకున్నాయి. దీంతో ఇంట్లో వారు బయటకు పరుగులు తీశారు. స్థానికులు వచ్చి మంటలకు ఆర్పివేశారు. రూ.9లక్షల విలువైన వస్తువులు కాలిబూడిదయ్యాయని బాధితుడు తెలిపారు. పిగుడు పడిన విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు, ఆర్డీఓ చెన్నయ్య, డీఎస్పీ పి. వెంకటగిరి, మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించారు.

ఈతకు వెళ్లి మృత్యు ఒడిలోకి..

- నీటి కుంటలో మునిగి బాలుడు మృతి
- నకిరేకల్‌లోని ఎర్రకుంట వద్ద ఘటన


సాత్విక్ (ఫైల్)


సాత్విక్ మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు

నకిరేకల్: ఈతకు వెళ్లి బాలుడు మృతిచెందిన ఘటన నకిరేకల్‌లో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడకు చెందిన నేలపట్ల శ్రీను, సరిత దంపతులు ఆరేళ్ల క్రితం నకిరేకల్‌కు వలస వచ్చి వీటీ కాలనీలో అద్దెకు ఉంటున్నారు. శ్రీను రైస్ మిల్లులో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు సాయిచరణ్ స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో 6వ తరగతి, చిన్న కుమారుడు సాత్విక్(10) స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నారు. ఒంటి పూట బడులు కావడంతో గురువారం సాయిచరణ్, సాత్విక్ బడికి వెళ్లి మధ్యాహ్నమే ఇంటికి వచ్చారు. అనంతరం సాయిచరణ్ ఆడుకునేందుకు ఇంటి సమీపంలోని స్టేడియంలోకి వెళ్లగా, సాత్విక్ తన మిత్రులతో కలిసి ఈత కొట్టేందుకు సంతోష్‌నగర్ సమీపంలోని ఎర్రకుంట వద్దకు వెళ్లాడు. తోటి స్నేహితులు కుంటలోకి దిగి ఈత కొడుతుండగా, సాత్విక్ కూడా కుంట ఒడ్డున తన డ్రెస్, చెప్పులు విడిచి నీటిలోకి దిగాడు. కుంట లోతుగా ఉండటంతో ఈత రాక నీటిలో మునిగిపోయాడు. ఇది గమనించిన అతడి స్నేహితులు భయంతో పరుగులు తీశారు. సాత్విక్ తల్లి కూడా తన కుమారుడు ఇంకా ఇంటికి రాలేదని వెతుక్కుంటూ ఎర్రకుంట వద్దకు చేరుకుని ఒడ్డున ఉన్న అతడి డ్రెస్, చెప్పులు గుర్తించి కన్నీరుమున్నీరయ్యింది. సాత్విక్ అమ్మమ్మ, తాతయ్య ఊరు కేతేపల్లి మండలం ఇనుపాముల గ్రామం కాగా, మనవడి మృతదేహంపై పడి బన్నీ.. బన్నీ.. అంటూ తాత రోదించిన తీరు అందరినీ కంట తడిపెట్టించింది. సమాచారం అందుకున్న నకిరేకల్ ఎస్ఐ రంగారెడ్డి, ఫైర్ ఎస్ఐ భీముడు కుంట వద్దకు చేరుకుని బాలుడి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రంగారెడ్డి తెలిపారు.

విద్యార్థి మృతితో అప్పన్నగూడెంలో విషాదం


ఆస్పత్రిలో పరామర్శిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి


చివ్వెంల మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల భవనం


పాఠశాల గేటు ముందు తమ పిల్లల కోసం ఎదురుచూస్తున్న తల్లిదండ్రులు

మోతె: చివ్వెంల మండల కేంద్రంలో మహాత్మాజ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో గురువారం నీటి సంపు గోడ కూలి విద్యార్థి రావుట్ల పవన్ (10) మృతితో మోతె మండలం అప్పన్నగూడెంలో విషాదం నెలకొంది. రావుట్ల శ్రీనివాస్, ఉమ దంపతుల కుమారుడు పవన్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. పవన్ తండ్రి స్వస్థలం ఖమ్మం జిల్లా కాగా.. పవన్ తల్లి ఉమ ఏడేళ్ల క్రితం నుంచి అప్పన్నగూడెంలోని తన పుట్టినిట్లోనే ఉంటూ కూలి పనులు చేసుకుంటూ తన పిల్లలను చదివిస్తున్నది. ఉమకు ఒక కొడుకు, కూతురు ఉన్నారు. కుమార్ పవన్ నీటి సంపులో పడి మృతి చెందాడని తెలియడంతో ఉమ బోరున విలపిస్తూ చివ్వెంలకు బయలుదేరింది.

ఆందోళనలో శాలిలింగోటం ప్రజలు

శాలిగౌరారం: సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలోని ప్రభుత్వ బిసి గురుకుల పాఠశాలలో నీటి సంపు కూలిన ప్రమాదంలో శాలిలింగోటంకు చెందిన కొప్పుల యశ్వంత్(10)కు తీవ్ర గాయాలు కావడంతో శాలిలింగోటం ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. యశ్వంత్ తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్తులు రాత్రి సూర్యాపేటకు బయలుదేరారు. యశ్వంత్‌ను పరీక్షించిన వైద్యులు అతని ఆరోగ్య పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్‌కు తరలించినట్లు కుటింబీకులు తెలిపారు. శాలిలింగోటంకు చెందిన కొప్పుల కిరణ్-సత్యవతి దంపతులకు కుమారుడు యశ్వంత్ (10), కుమార్తె ఉన్నారు. గ్రామంలో వ్యవసాయ కూలీలుగా జీవనోపాధిని పొందుతున్న వీరు బతుకుదెరువు కోసం రెండు సంవత్సరాల క్రితం నల్లగొండకు వలస వెళ్లారు.

బైక్‌ను ఢీకొట్టిన డీసీఎం

- అక్క మృతి, తమ్ముడికి తీవ్ర గాయాలు


గుడిపాటి విజయ మృతదేహం

మోత్కూరు: బైక్‌ను డీసీఎం ఢీకొట్టిన ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న అక్క అక్కడికక్కడే మృతిచెందగా, తమ్ముడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మోత్కూరు మండల పరిధిలోని పాటిమట్ల గ్రామ శివారులో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డగూడూరు మండలం ధర్మారం గ్రామానికి చెందిన గుడిపాటి విజయ(32), ఆమె సోదరుడు మందుల విజయ్ బైక్‌పై మోత్కూరుకు వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా పాటిమట్ల శివారులో వెనుక నుంచి డీసీఎం వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విజయ అక్కడికక్కడే మృతిచెందగా, విజయ్ ఎడమ కాలు విరిగింది. తీవ్రంగా గాయపడిన విజయ్‌ను చికిత్స నిమిత్తం స్థానికులు భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి. జానకిరాంరెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కోదాడ రూరల్: మండల పరిధిలోని రామాపురం క్రాస్ రోడ్డు వద్ద గురువారం ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై వెళ్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ మండలంలోని ద్వారకుంట గ్రామానికి చెందిన బాషబోయిన గోపి, వీరబోయిన నర్సింహరావు గురువారం బైక్‌పై ఆంధ్రప్రదేశ్‌లోని జగ్గయ్యపేటకు బయల్దేరారు. మార్గమధ్యలో రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం వారిని కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. క్షతగాత్రుడు వీరబోయిన నర్సింహరావు సోదరుడు వీరబోయిన మధు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కోదాడ రూరల్ ఎస్ఐ సాయిప్రశాంత్ తెలిపారు.

స్కూటీ ఢీకొని వ్యక్తికి..

డిండి: రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని స్కూటీ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం రాత్రి మండలంలోని చెర్కుపల్లిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని చెర్కుపల్లి గ్రామానికి చెందిన దేగ అనిల్ తన స్కూటీపై అజాగ్రత్తగా వెళ్తూ అదుపుతప్పి రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తున్న అదే గ్రామానికి చెందిన మూడావత్ రవిని ఢీకొట్టాడు. దీంతో రవి కాలు, తలకు గాయాలు కాగా చికిత్స నిమిత్తం దేవరకండలోని ఆస్పత్రికి తరలించారు. రవి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి..

గుండాల: ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు గాయాలపాలైన సంఘటన మండలంలోని సుద్దాల గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. వివరాలు.. సుద్దాల గ్రామానికి చెందిన యామగాని రాములు రోజుమాదిరి గ్రామంలో తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడడంతో అతడి కాలు విరిగింది. తోటి గీత కార్మికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు చికిత్స నిమిత్తం అతడిని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఎదురెదురుగా ఢీకొన్న ప్రభుత్వ వాహనాలు

- ఒకరికి గాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న పోలీస్ పెట్రోలింగ్ వాహనం

మోత్కూరు: పోలీస్ పెట్రోలింగ్ వాహనం, 102(అమ్మఒడి) వాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని పాటిమట్ల ప్రధాన రహదారి వద్ద గురువారం చోటు చేసుకుంది. వివరాలు.. మోత్కూరు వైపునకు వస్తున్న పోలీస్ పెట్రోలింగ్ వాహనం, మోత్కూరు నుంచి అడ్డగూడూరు వైపు వెళ్తున్న 102 వాహనం పాటిమట్ల ప్రధాన రహదారి మూలమలుపు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పోలీస్ పెట్రోలింగ్ వాహనం నడుపుతున్న శ్రీనివాస్‌రెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. రెండు వాహనాల ముందు భాగంలో ఎడమ వైపు చక్రాలు ఊడిపోయాయి. 102 వాహనంలో డ్రైవర్ నవీన్ మినహా పేషెంట్లు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

నిడమనూరు: ఉరేసుకుని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని మార్లగడ్డ క్యాంపులో గురువారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మార్లగడ్డకు చెందిన వీసాల మనోహర్ అలియాస్ యాదగిరి, కల్పన(35) భార్యాభర్తలు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె సంతానం. వారు హైదరాబాద్‌లో ఇంటర్మీడియట్ చదువుతున్నారు. మనోహర్ మండలంలోని జంగాలగూడెం ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఆరు నెలల క్రితం మనోహర్ తల్లి మృతిచెందడంతో ఇంటి వద్ద తండ్రి ఒక్కడే ఉంటున్నాడు. దీంతో నల్లగొండలో ఉండే భార్యాభర్తలు మూడు నెలల క్రితం మార్లగడ్డకు మకాం మర్చారు. గురువారం కల్పన తరపు బంధువుల శుభకార్యానికి వెళ్లాలని ఇద్దరూ తయారయ్యారు. బయటికి వెళ్దాం అనుకుంటున్న సమయంలోనే వర్షం మొదలవ్వడంతో వారు ఆగిపోయారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. మాటామాట పెరిగి భార్య కల్పనను మనోహర్ చెంప దెబ్బకొట్టి ఫోన్ వస్తే మాట్లాడుకుంటూ పక్కకు వెళ్లాడు. అతడు అటు వెళ్లగానే కల్పన ఇంట్లోకి వెళ్లి తలుపు పెట్టుకుంది. అక్కడే ఉన్న మనోహర్ తండ్రి మల్లయ్య అలిగి వెళ్లిందిలే అనుకుని వరండాలో పడుకుండిపోయాడు. కొంతసేపటి తర్వాత మనోహర్ వచ్చి కల్పన ఏదీ తండ్రిని అడగగా, లోపలికి వెళ్లింది అని చెప్పడంతో తలుపు కొట్టాడు. లోపల గడియ పెట్టి ఉండడంతో అనుమానంతో తలుపును గట్టిగా కొట్టి తీయగా, కల్పన ఉరేసుకుని విగతజీవిగా కనిపించింది. మనోహర్ రోదిస్తుండడంతో చుట్టు పక్కల వారు వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి వివరాలు సేకరించి కల్పన మృతదేహాన్ని పోస్టుమార్టం తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా ఈ ఘటనపై రాత్రి వరకు ఎవరూ తమకు ఫిర్యాదు చేయలేదని ఎస్ఐ శోభన్‌బాబు తెలిపారు.

ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేసేందుకు కుట్ర

మోత్కూరు : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను అరెస్టు చేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. గురువారం మోత్కూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. లిక్కర్ స్కాంలో ఇరికించి ఈడీ చేత అరెస్టు చేయించాలనే ఆలోచనలో బీజేపీ ప్రభుత్వం ఉందని, కేంద్రం తీరుకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీని ఏర్పాటు చేయడాన్ని జీర్ణించుకోలేని కేసీఆర్ కుటుంబంపై కుట్రలు చేస్తుందన్నారు. సీబీఐ, ఐటీ, ఈడీ లాంటి దర్యాప్తు సంస్థలను అడ్డం పెట్టుకొని రాష్ట్రంలోని పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలను వేధిస్తుందని దుయ్యబట్టారు. మోదీ సర్కార్ ఈడీతో జతకట్టి కవితను ఢిల్లీకి పిలిపించి అరెస్టు చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతుందన్నారు. కవితను అరెస్టు చేస్తే నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

చెరువులను పరిశీలించిన అధికారులు


భువనగిరి: గాంధీనగర్ సమీపంలోని కందకం వద్ద పార్కు అభివృద్ధి కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, హెచ్ఎండీఏ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి తదితరులు

భువనగిరి: పట్టణంలోని గాంధీనగర్ సమీపంలో కందకం వద్ద పార్కును అభివృద్ధి చేసేందుకు గురువారం అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో పాటు హెచ్ఎండీఏ డైరెక్టర్, అర్బన్ ఫారెస్ట్రీ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కందకం వద్ద స్థలం గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెద్ద చెరువు ట్యాంక్ బండ్‌ను, రాయగిరిలోని మెట్లబావిని పరిశీలించారు. పెద్ద చెరువును మరింతగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులు ఆదేశించారు. వీరి వెంట మున్సిపల్ చైర్మన్ ఆంజనేయులు, వైస్ చైర్మన్ కిష్టయ్య, కమిషనర్ నాగిరెడ్డి ఉన్నారు.

భూదాన్‌పోచంపల్లిలో..

భూదాన్‌పోచంపల్లి: పోచంపల్లి చెరువును సుందరీకరించడానికి గురువారం హెచ్ఎండీఏ అధికారులతో కలిసి అడిషనల్ కలెక్టర్ దీపక్‌తివారీ చెరువు, చెరువు కట్టను పరిశీలించారు. కట్ట వెడల్పు చేయడం, ఆట స్థలం, బతుకమ్మ ప్లాట్‌ఫాం, మున్సిపల్ ఆఫీసు వెనుక నుంచి పర్రె కాలువ వరకు కనెక్టివిటీ రోడ్డు తదితర ప్రతిపాదిత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. చెరువును సుందరీకరించి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి హెచ్ఎండీఏ అధికారులకు ఆదేశించారని తెలిపారు. అధికారుల ఆదేశాల మేరకు చెరువు సుందరీకరణ, అభివృద్ధి కోసం రూ.25 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు రూపొందించామని పేర్కొన్నారు. అందులో భాగంగానే అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి పలు సూచనలు చేశారని తెలిపారు.

బీబీనగర్ చెరువును..

బీబీనగర్: మండల కేంద్రంలోని జాతీయ రహదారి పక్కన గల పెద్ద చెరువుతో పాటు కట్ట రోడ్డును గురువారం జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో పాటు హెచ్ఎండీఏ అధికారులు పరిశీలించారు. చెరువు కట్టపై త్వరలో చేపట్టనున్న సుందరీకరణ పనులతో పాటు మినీ ట్యాంక్‌బండ్ ఏర్పాటుకు అయ్యే అంచనా వ్యయంపై చర్చించారు. త్వరలో సుందరీకరణపై నివేదికలను తయారు చేసి నిధుల విడుదలకు చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సుధాకర్‌గౌడ్, జెడ్పీటీసీ ప్రణీతాపింగళ్‌రెడ్డి, సర్పంచ్ భాగ్యలక్ష్మీశ్రీనివాస్, హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్ట్ డైరెక్టర్ ప్రభాకర్, అధికారులు పరంజ్యోతి, శ్రీలేఖ్య, లేక్‌రాం, అఫ్రోజ్, వెంకన్న పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగిపై కేసు నమోదు

మాడుగులపల్లి: రెవెన్యూ అధికారులను తప్పుదోవ పట్టించి ఈడబ్ల్యూఎస్ (ఎకనామికల్లీ వీకర్ సెక్షన్) ధ్రువీకరణ పత్రం పొందేందుకు యత్నించిన ప్రభుత్వ ఉద్యోగిపై గురువారం కేసు నమోదు చేసినట్లు మాడుగులపల్లి ఎస్ఐ కైగూరి నరేష్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. కుక్కడం గ్రామానికి చెందిన మునగాల చంద్రప్రకాష్‌రెడ్డి గత నెల 24వ తేదీన ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణ పత్రం కోసం తన ఆదాయం రూ.8లక్షల లోపు ఉన్నట్లు తెలుపుతూ న్యాయవాదితో నోటరీ చేయించి తహసీల్దార్‌కు దరఖాస్తు సమర్పించాడు. క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించిన రెవెన్యూ అధికారులు చంద్రప్రకాష్‌రెడ్డి ప్రభుత్వ ఉద్యోగి అని, ఆదాయం, ఆస్తులు సైతం అధికంగా ఉన్నట్లు నిర్ధారించారు. ప్రభుత్వ ఉద్యోగిగా ఉండి తప్పుడు సమాచారంతో లబ్ధి పొందేందుకు యత్నించిన చంద్రప్రకాష్‌రెడ్డిపై తహసీల్దార్ అర్చన పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మిర్యాలగూడ ప్రథమ శ్రేణి కోర్టు న్యాయమూర్తి ఆదేశాల మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేష్‌కుమార్ పేర్కొన్నారు. చంద్రశేఖర్‌రెడ్డి వ్యవసాయ విస్తరణ అధికారిగా పనిచేస్తున్నట్లు తెలిసింది.